
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
శనివారం 24 ఫిబ్రవరి 2024



ఉపరితల రిజర్వాయర్ నిర్మాణానికి రూ.15 కోట్లు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 23: నగర పాలక సంస్థ పరిధిలో ఎలివేటెడ్ లెవెల్ ఉపరితల రిజర్వాయర్ నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆనందరావు ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని 52 వార్డులలో తాగునీటికి శాశ్వత పరిష్కారం కోసం గతంలో నగర పాలక సంస్థ ప్రతిపాదనలు పంపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంస్థ సాధారణ నిధులతో రిజర్వాయర్‌ను నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కౌన్సిల్ తీర్మానం పంపినట్లు ఈఎన్‌సీ పేర్కొన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..!


హెడ్ వర్క్ పనుల వద్దే ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ

రాయలసీమ జిల్లాల్లో కరువు.. వలసలు శాశ్వతంగా నివారించే లక్ష్యంగా చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా రైతులకు వరమే! ఏ ప్రభుత్వం చేపట్టినా వారు స్వాగతిస్తారు. అయితే ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి పాలకులకు ఉండాలి. జగన్ ప్రభుత్వంలో అది ఏమాత్రం కనిపించడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. జగన్ హడావుడిగా, ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడం తప్ప అవసరమైన మేరకు అనుమతులు, నిధులు లేకపోవడం ఆ ప్రాజెక్టుల పాలిట శాపంగా మారింది. రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ)లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులకు రూ.1,360 కోట్ల బిల్లులు చెల్లించకపోవడం వల్ల ఈ పనులు చేయలేమంటూ కాంట్రాక్టర్లు ఆపేశారు. ప్రధాని మోదీని సీఎం జగన్ గట్టిగా అడగలేని పరిస్థితి వల్ల పీఎం కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) గ్రాంట్ అందని ద్రాక్షగా మారిందనే విమర్శ ఉంది.

- జగన్ నిర్వాకంతో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు
- నాడు రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ పేరిట హడావుడి
- చేసిన పనుల్లో రూ.1,393 కోట్ల బిల్లులు పెండింగ్..
- పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- పీఎం కృషి సంచాయి గ్రాంట్ ఇవ్వలేమన్న కేంద్రం
- నాడు ఆర్భాటం.. నేడు నిస్తేజం

వేదవతి ప్రాజెక్టు కోసం తెచ్చిన పైపులు ఇలా పొలాల్లోనే

కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ) కింద జగన్ ప్రభుత్వం మూడేళ్ల కింద ఆర్భాటంగా ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో 23 ప్రాజెక్టులు రూ.33,862 కోట్లతో చేపట్టింది. నిధులు కేటాయింపులు లేకుండానే హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఏదో సాధించాలనుకుని రంగంలోకి దిగిన ప్రభుత్వం నిధుల లేమితో.. చివరికి ఏమీ చేయలేకపోతుంది. ప్రభుత్వం వద్ద నిధులు లేవు. అప్పులు పుట్టక.. ఆదుకుంటుందని ఆశించిన కేంద్ర ప్రభుత్వం కూడా చేతులెత్తేయడంతో ఈ ప్రాజెక్టులు పూర్తి అయ్యేదెన్నడో..? అనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లో కృష్ణా, తుంగభద్ర, పెన్నా వంటి నదులు ప్రవహిస్తున్నా.. కరువు రైతుల కన్నీళ్లు తుడిచేలా వరద జలాలు సద్వినియోగం చేసుకోలేని దుస్థితి ఉంది. 15-20 ఏళ్లుగా శ్రీశైలం జలాశయానికి వరద లెక్కలను పరిశీలిస్తే ఏటేటా వరద రోజులు (ఫ్లడ్ డేస్) తగ్గిపోతున్నాయి. ఈ క్రమంలో తక్కువ సమయంలో ఎక్కువ వరద జలాలు వినియోగించుకోవాలని జగన్ ప్రభుత్వం ఆలోచన చేసింది. అయితే ఎన్నో తరాలకు ఉపయోగపడే ప్రాజెక్టుల రూపకల్పనలో తొందరపాటు, నిధులు కేటాయింపులు లేకుండా ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడం.. నిధులు లేమి.. పాలకుల నిర్లక్ష్యం.. ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం సీమ ప్రాజెక్టులకు శాపంగా మారింది. రాయలసీమ దుర్భిక్ష నివారణలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.9,725 కోట్ల అంచనాతో రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు ఎస్ఆర్ఎంసీ సహా జీఎన్ఎస్ఎస్ కెనాల్ సీసీ లైనింగ్, గోరుకల్లు జలాశయం నుంచి అవుకు జలాశయం వరకు జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్ సీసీ లైనింగ్, అవుకు మూడవ అదనపు టన్నెల్ తవ్వకం, కుందూ నది విస్తరణ పనులు చేపట్టారు. 2020-21లో ఆర్భాటంగా చేపట్టారు. కాంట్రాక్ట్ గడువు 30 నెలలు. ప్రారంభంలో వేగంగా పనులు చేశారు. దాదాపుగా రూ.2,300 కోట్లు చేస్తే సుమారుగా రూ.1,360 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు.

అడగని జగన్.. ఇవ్వని మోదీ!


పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

నీతి అయోగ్ సభ్యుడు అవినాశ్ మిశ్రా సూచన మేరకు రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ కింద చేపట్టిన 23 ప్రాజెక్టుల్లో 11 ప్రాజెక్టులకు ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) గ్రాంట్ కోసం దరఖాస్తు చేశారు. దీని కింద ఎంపికైతే 70 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో ఇస్తుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బీసీఆర్ వరకు ప్రధాన కాలువ లైనింగ్‌కు రూ.570.45 కోట్లు, బానకచర్ల నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ కెనాల్ సీసీ లైనింగ్‌కు రూ.939.65 కోట్లు, గాలేరు-నగరి కెనాల్ 0-56 కి.మీల వరకు ఇంప్రూవ్‌మెంట్ రూ.305.70 కోట్లు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ లైనింగ్‌కు రూ.1,457 కోట్లు, అవుకు రిజర్వాయర్ - గండికోట రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ కెనాల్ ఇంప్రూవ్‌మెంట్ రూ.633 కోట్లు, కడప జిల్లా సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో పీబీసీ, సీబీఆర్ రైట్ కెనాల్, జీఎల్ఐ మైక్రో ఇరిగేషన్ రూ.1,233 కోట్లు, యురేనియం బాధిత గ్రామాలకు తాగునీరు అందించే సీబీఆర్ - ఎర్రబల్లి లిఫ్ట్‌కు రూ.1,113 కోట్లు, గండికోట నుంచి చిత్రావతి, పైడిపాలెం ఎత్తిపోతల పథకాల అప్‌గ్రేడ్ రూ.3,674 కోట్లు, జీఎన్ఎస్ఎస్ - హంద్రీనీవా ఎత్తిపోతల పథకం రూ.5,030 కోట్లు, నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు ఫ్లడ్‌ఫ్లో కెనాల్స్ ఇంప్రూవ్‌మెంట్స్ రూ.951 కోట్లు, జీకేఎన్ కెనాల్ (సోమశిల - రాళ్లపాడు రిజర్వాయర్)కు రూ.655 కోట్లు కలిపి రూ.16,568 కోట్లు పీఎంకేఎస్‌వై గ్రాంట్ ఇవ్వాలని ప్రతిపాదించారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జలవనరుల శాఖ ఇంజనీర్లు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి గ్రాంట్ కోసం ప్రయత్నాలు చేశారు. సీఎం జగన్ గట్టిగా అడగకపోవడం, ప్రధాని మోదీ కనికరించకపోవడంతో గ్రాంట్ అందని ద్రాక్షగా మారింది.


ఆగిన రాయలసీమ లిఫ్ట్ పనులు

పడకేసిన వేదవతి, ఆర్డీఎస్

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసల నివారణే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వంలో నాటి సీఎం చంద్రబాబు ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులు చేపట్టారు. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంగా మారింది. రూ.1,981 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ ఆర్డీఎస్ కుడి కాలువ పనులు ఎస్‌సీసీ సంస్థ దక్కించుకుని హెడ్ రెగ్యులేటర్, ఒక కిలోమీటరు ప్రధాన కాలువ పనులకు రూ.12 కోట్లు ఖర్చు చేస్తే జగన్ ప్రభుత్వం ఒక్క పైసా బిల్లులు చెల్లించలేదు. రూ.1,942 కోట్లతో చేపట్టిన వేదవతి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. రూ.104 కోట్ల పనులు చేస్తే రూ.83 కోట్లు బిల్లులు చెల్లించారు. రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులలేమితో రెండున్నరేళ్లుగా ఈ ప్రాజెక్టులు అటకెక్కాయి.

మిషన్ ముందుకు వెళ్లేదెలా..?

- శ్రీశైలం ఎగువన సంగమేశ్వరం నుంచి 854 అడుగులు దిగువన 35 వేల క్యూసెక్కులు ఎత్తిపోసుకోవడానికి వీలుగా రాయలసీమ లిఫ్ట్ చేపట్టారు. అంచనా రూ.3,825 కోట్లు కాగా.. కాంట్రాక్ట్ విలువ (ఈపీసీ) రూ.3,307 కోట్లకు టెండర్లు పిలిస్తే.. మెగా సంస్థ, ఎస్‌పీఎంఎల్ సంస్థ జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్నారు. 30 నెలల్లో పనులు పూర్తి చేసేలా 2020లో ఒప్పందం చేసుకున్నారు. 12 పంపుల ద్వారా ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఎస్ఆర్ఎంసీ కాలువకు వరద జలాలు తరలించాలన్నది లక్ష్యం. ముందు చూపు, ప్రణాళిక లేకుండా ఆర్భాటంగా చేపట్టడంతో పర్యావరణ అనుమతులు (ఈసీ) లేవని గ్రీన్ ట్రైబ్యునల్‌లో తెలంగాణ ఫిర్యాదు చేయడం వల్ల పనులు ఆగిపోయాయి. అప్పటికే రూ.740 కోట్లు పనులు చేశారు. అయితే.. తాగునీటి కోసం గత ఆగస్టు నుంచి 6 పంపుల పనులు చేపట్టి సుమారుగా రూ.50 కోట్ల విలువైన పనులు చేశారు.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసీ), బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు 50 కిలో మీటర్లు గాలేరు-నగరి వరద కాలువ (జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్) సామర్థ్యం రెట్టింపు చేస్తూ సీసీ లైనింగ్ అంచనా రూ.1,500 కోట్లు కాగా.. ఈసీవీ రూ.1,061.69 కోట్లతో 2020 ఆగస్టు 28న టెండర్లు పిలిస్తే.. ఆగ్రాకు చెందిన పీఎస్‌సీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ పనులు దక్కించుకొని 2021 మార్చి నెలలో 36 నెలల్లో పూర్తి చేసేలా ఒప్పందం చేసుకుంది. రూ.350 కోట్లు ఖర్చు చేస్తే.. ఒక్క పైసా కూడా బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు పనులు ఆపేశారు.
- గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 60 కిలోమీటర్లు జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్ సీసీ లైనింగ్, 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 6 కిలోమీటర్లు పొడవు అవుకు మూడో అదనపు టన్నెల్ పనులు రూ.1,500 కోట్లు అంచనాతో చేపట్టారు. ఈసీవీ విలువ రూ.1,269.49 కోట్లకు 2020 సెప్టెంబరు ఒకటో తేదీన టెండర్లు పిలిచారు. డీఎస్ఆర్-వీపీఆర్‌కేఎస్ సంస్థలు జాయింట్ వెంచర్‌గా పనులు దక్కికున్నాయి. రూ.900 కోట్లు విలువైన పనులు చేస్తే ప్రభుత్వం రూ.200 కోట్లు బిల్లులు చెల్లించింది. రూ.700 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు ఆగిపోయాయి.
- నిప్పలవాగు, కుందూ నదులు 30 వేల క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా విస్తరణ, 2.9 టీఎంసీల సామర్థ్యంతో రాజోలి జలాశయం, 0.80 టీఎంసీల సామర్థ్యంతో జొలదరాశి జలాశయాల పనులు ఒకే ప్యాకేజీగా అంచనా విలువ రూ.2,900 కోట్లు కాగా.. ఈసీవీ విలువ రూ.1,769.65 కోట్లకు 2020 నవంబరు 11న టెండర్లు పిలవగా ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండస్ట్రీస్ (అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబానికి చెందిన సంస్థ) పనులు దక్కించుకుంది. కుందూ నది విస్తరణ పనులు ఒక్కటే రూ.310 కోట్ల పనులు చేస్తే ఒక్క పైసా బిల్లు రాలేదని పనులు ఆపేశారు. రాజోలి, జొలదరాశి జలాశయాల పనులకు ఒక్క ఇటుక కూడా వేయలేదు. ఈ పనులకు 2019 డిసెంబరు 25న సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.

హాఫీజ్‌ఖాన్ అవుట్!

- కర్నూలు వైసీపీ ఇన్‌చార్జిగా డాక్టర్ ఇలియాస్ బాషా!
- అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు
- ఎమ్మెల్యే హాఫీజ్, ఎస్వీ వర్గాలకు జగన్ మొండిచేయి
- కర్నూలు వైసీపీలో చెలరేగిన టికెట్ మంటలు



కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వైసీపీ సమన్వయకర్త (రాబోయే ఎన్నికల్లో అభ్యర్థి)గా డాక్టర్ ఇలియాజ్ బాషాను ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వైసీపీ అధిష్టానం అధికారికంగా ప్రకటించడమే మిగిలి ఉంది. మళ్లీ తనకే టికెట్ వస్తుందంటూ కొంత కాలంగా ప్రచారం చేసుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు వైసీపీ అధిష్టానం కోలుకోలేని షాక్ ఇచ్చింది. తాను సీఎం జగన్‌కు అత్యంత విశ్వాసపాత్రుడినని, రాయలసీమలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా తర్వాత తనేనంటూ ఆయన ఇన్నాళ్లు ధీమా వ్యక్తం చేసేవారు. చివరకు మరో రెండు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే క్రమంలో డాక్టర్ ఇలియాజ్ బాషా తెరపైకి వచ్చాడు. ఇక మొదటి నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేసిన మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులకూ నిరాశే మిగిలింది.

ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు టికెట్ లేనట్లే...

వైసీపీ అధినేత, సీఎం జగన్ ఉమ్మడి జిల్లాలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే, మంత్రి గుమ్మనూరు, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్‌లకు రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేనని తేల్చేసి.. ఆ నియోజకవర్గాలకు కొత్తగా సమన్వయకర్తలను (రాబోయే వైసీపీ అభ్యర్థులు) నియమించారు. గత నెలలోనే కర్నూలు టికెట్ పంచాయతీ తేల్చాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు విజయవాడకు పిలిపించి తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా వైసీపీ పెద్దలు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, సీఎంవో ఆఫీస్ ధనుంజయరెడ్డిలు చర్చలు జరిపారు. చర్చల్లో భాగంగానే ఈసారి టికెట్ ఇవ్వడం లేదని, డాక్టర్ ఇలియాజ్ బాషాకు ఇస్తున్నట్లు స్పష్టం చేసినట్లు సమాచారం. వారి ప్రతిపాదనలు వ్యతిరేకించిన హాఫీజ్‌ఖాన్ ఆగ్రహంతో ఊగిపోయి సీఎం జగన్‌ను కలవకుండానే హైదరాబాద్‌కు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు అధిష్టానం బుజ్జగించడంతో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, డాక్టర్ ఇలియాజ్‌బాషా గురువారం తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. దీంతో కర్నూలు వైసీపీ సమన్వయకర్తగా డాక్టరు ఇలియాజ్ బాషా ఖరారు అయినట్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కౌన్ ఏ ఇలియాజ్..?


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డాక్టర్ ఇలియాజ్ బాషా ఆర్థో విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. కర్నూల్లోని అశోక్‌నగర్‌కు చెందిన ఈయన కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇక్కడే ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ఓ ప్రైవేటు క్లీనిక్ కూడా నిర్వహిస్తున్నారు. గత ఎన్నికల్లో కూడా వైసీపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు.



ఎస్వీ దంపతుల దారెటు..?

మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి ఇద్దరిలో ఒకరికి టికెట్ ఇవ్వాలని వైసీపీ అధిష్టానం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. గత నెలలో ముస్లింలు, క్రిస్టియన్ మైనార్టీ, ఎస్సీ, బీసీ, ఎస్టీ నాయకులు, ఎస్వీ వర్గానికి చెందిన కార్పొరేటర్లు గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో ఓ హోటల్‌లో ప్రత్యేకంగా సమావేశమై ఎస్వీ దంపతుల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో ఆనాటి ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కష్టపడడం వల్లే వైసీపీ అభ్యర్థి అఫీజ్‌ఖాన్ అత్యల్పంగా 5 వేల ఓట్లతో గట్టెక్కారని దాన్ని దృష్టిలో ఉంచుకుని ఎస్వీ కుటుంబానికి టికెట్ ఇవ్వాలంటూ ముస్లింసెల్ నాయకులు డిమాండ్ చేశారు. తాజాగా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో ఎస్వీ దంపతులు, ఆయన వర్గీయులకు నిరాశ మిగిలింది. ఈ క్రమంలో ఎస్వీ దంపతులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

జగన్ ముమ్మాటికీ పెత్తందారు


టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: దేశంలోనే సంపన్నుడైన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. పేదల పక్షపాతి కాదని, ముమ్మాటికీ పెత్తందారేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో జగన్ సంపద సృష్టించడం చేత కాక అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దేశంలో ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చి వేసిన ఘనత జగన్‌దే అని అన్నరు. రాబోయ ఎన్నికల ప్రచారానికి జగన్‌కు ప్రత్యేకంగా హెలిక్యాప్టర్ ఉందని, పైగా భద్రత సాకు చూపుకుని ప్రజల సొమ్ముతో హెలిక్యాప్టర్లు లీజుకు తీసుకున్నారని అన్నారు. సంఘ విద్రోహ శక్తుల నుంచి తనకు ముప్పుఉందని జగన్ సాకులు చెప్తతున్నారని, అసలు విషయం ఏమంటే ఆయనను మించిన సంఘ విద్రోహ శక్తులు రాష్ట్రంలో ఎవరూ లేదని అన్నారు. భద్రతా కారణాలను బూచిగా చూపి రెండు హెలిక్యాప్టర్లను లీజుకు తీసుకున్నారని, 3 నెలలకు రెండు హెలిక్యాప్టర్లకు రూ. 11.5 కోట్లు చెల్లించాలని అన్నారు. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం కాదా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో తమ కోసం అహర్నిశలు కృషి చేసే చంద్రబాబును గద్దె ఎక్కించాలని ప్రజలు కృత నిశ్చయంతో ఉన్నారని అన్నారు.

నేడు టీడీపీ తొలి జాబితా!

కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీడీపీ దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికలకు టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితా సిద్ధం చేసింది. ఈ జాబితాను శనివారం అధికారికంగా ప్రకటించనున్నారు. మాఘ పౌర్ణమి మంచి రోజు కావడంతో రెండు పార్టీల అధినేతలు తొలి జాబితాను శనివారం ఉదయం 11:40 గంటలకు విడుదల చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే పలుమార్లు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సమావేశమై సీట్ల కేటాయింపులపై చర్చించారు. దాదాపు 65 సీట్ల వరకు స్పష్టమైన ప్రకటన వచ్చే అవకాశం ఉంది. కర్నూలు జిల్లా నుంచి కీలక సెగ్మెంట్లలో ఎవరెవరు టీడీపీ, జనసేన కూటమి నుంచి బరిలో ఉంటారన్న ఉత్కంఠకు తెరపడనుంది. ప్రస్తుతానికి నియోజకవర్గాలో టికెట్ కోసం ఏకాభిప్రాయంతో ఉన్నవారికి, ఏకతాటిపై ఉన్న నేతల పేర్లు జాబితాలో ఉండబోతున్నాయి. ఇప్పటికే అభ్యర్థులుగా ఎంపిక చేసిన వారికి టీడీపీ ఓ క్లారిటీ ఇచ్చింది. రెండో జాబితా కూడా మరో పది రోజుల్లో విడుదల చేసేలా టీడీపీ-జనసేన కూటమి సిద్ధమైనట్లు సమాచారం.

ఆశావహుల్లో టెన్షన్



మార్కెట్ కమిటీ అవినీతిమయం..?

- అందినకాడికి దండుకుంటున్న అధికారులు
- దళారులు, అధికారుల కుమ్మక్కుతో నష్టపోతున్న రైతులు


ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 23: వేరుశనగ పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలకు పెట్టింది పేరు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు పక్కనున్న తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల వేరుశనగ రైతులు అమ్మకాలు చేసుకునేందుకు ఈ మార్కెట్‌కే పంటను తరలిస్తుంటారు. అలాంటి పేరున్న మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా రోజురోజుకూ అవినీతి పెచ్చుమీరిపోతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. చిన్నపాటి ట్రేడ్ లైసెన్స్‌లతో పాటు ఇతర అనుమతుల కోసం వేల రూపాయలు అధికారులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న పండ్లు, కూరగాయల మార్కెట్‌లో సైతం అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇందుకు ఉదాహరణే.. గురువారం ఏసీబీ అధికారుల దాడులు. ట్రేడ్ లైసెన్స్ కోసం వేల రూపాయలు డిమాండ్ చేసి ఓ మహిళా అధికారి పట్టుబడడం కలకలం రేపుతోంది.

లైసెన్స్ రెన్యువల్, మంజూరులో చేతివాటం ప్రదర్శిస్తున్న అధికారులు

వ్యవసాయ మార్కెట్ కమిటీలో దాదాపు 84 కమిషన్ ఏజెంట్ల దుకాణాలు ఉండగా దాదాపు 64 దుకాణాల్లో పెద్ద ఎత్తున పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలు నిత్యం జరుగుతుంటాయి. అలాగే మార్కెట్ పరిధిలో ఉన్న పండ్లు, కూరగాయల హోల్‌సెల్ మార్కెట్‌లో సైతం దాదాపు 42 దుకాణాలు ఉన్నాయి. మార్కెట్‌కు సాలీనా సెస్ రూపంలో దాదాపు రూ.5 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. కమిషన్ ఏజెంట్ల దుకాణాల లైసెన్స్‌లు రెన్యువల్ చేసే సమయంలో అధికారులు తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తూ వ్యాపారుల నుండి అందిన కాడికి దండుకుంటున్నారే ఆరోపణలు ఉన్నాయి. గతంలో స్థానికంగా పని చేసిన ఓ ప్రధాన అధికారి ఏకంగా బేరాలు పెట్టి దుకాణానికి ఇంత అని వసూలు చేసిన సందర్భాలు లేకపోలేదు. అంతేగాక సదరు అధికారి మార్కెట్‌లోనే కమిషన్ ఏజెంట్ దుకాణం, కూరగాయల మార్కెట్‌లో ఒక దుకాణాన్ని బినామి పేర్లపై న డిపేవాడని వ్యాపారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. సదరు వ్యాపారి బాటలోనే ప్రస్తుత అధికారులు కూడా ముందుకు సాగుతుండడం గమనార్హం. దుకాణాల లైసెన్స్ రెన్యువల్స్‌లో అవినీతికి తెరలేపిన అధికారగణం అంతటితో ఆగక ఒక అడుగు ముందుకేసి మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల లైసెన్స్‌ల రెన్యువల్స్, ఎవరైనా చనిపోయిన వారి స్థానంలో కొత్తవారిని తీసుకునేందుకు ఇచ్చే లైసెన్స్‌ల్లో హమాలీల నుంచి కూడా కొంత మొత్తాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. చేయి తడపనిదే లైసెన్స్‌లు ఇవ్వమనే ధోరణిలో ఉన్నట్లు ఇక్కడి అధికారుల తీరు మారింది. అంతేగాక కూరగాయల హోల్‌సెల్ దుకాణాల లైసెన్స్‌ల మంజూరులో కూడా మార్కెట్ చలానా కాదని మూడింతలు వసూలు చేస్తుండడంతోనే విసుగుచెందిన వ్యాపారులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. దాని ఫలితమే గురువారం మార్కెట్‌లో జరిగిన ఏసీబీ అధికారులు దాడులు అని చెప్పవచ్చు. ఏసీబీ అధికారులకు వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఓ అధికారి పట్టుబడడం మార్కెట్‌లో తీవ్ర కలకలం రేపింది.

వ్యాపారుల కుమ్మక్కు

వ్యవసాయ మార్కెట్ కమిటీలో పంట ఉత్పత్తుల విక్రయాల్లో కొనుగోలుదారులు కుమ్మక్కై ఇటు మార్కెట్‌కు, అటు రైతులకు నష్టాన్ని చేకూరుస్తున్నారు. వ్యాపారులంతా కుమ్మక్కై ఆరోజు మార్కెట్‌కు వచ్చిన పంట ఉత్పత్తులకు ఏ ధర నిర్ణయించాలో ముందుగానే మాట్లాడుకొని ఆ ధరకు మించి టెండరు వేయడంలేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వేరుశనగ ధరలను తక్కువ రాస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మార్కెట్‌కు వెళ్లి పరిశీలించి వ్యాపారులతో సమావేశం నిర్వహించి ధరలు తగ్గకుండా చూడాలని అధికారులకు సూచించారు. అయినా వ్యాపారుల తీరులో ఎటువంటి మార్పు రాకపోవడం గమనార్హం. వ్యాపారులు ఇలా కుమ్మక్కై టెండర్లు వేస్తుండడంతో రైతులకు మద్దతు ధర అందడం లేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో వచ్చిన కాడికి పంటలను అమ్ముకొని ఉసూరుమని అంటున్నారు.

రెట్టింపు కమిషన్ వసూలు

పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తెచ్చి విక్రయించిన రైతుల నుంచి 2 శాతం కమిషన్‌ను వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడి కమిషన్ ఏజెంట్లు మాత్రం అధికారుల సహకారంతో అందుకు విరుద్ధంగా రెట్టింపు కమిషన్‌లు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. తక్ పట్టీలో వాస్తవ కమిషన్ వసూలు చేస్తున్నట్లుగా రాసి వెనుకభాగంలో రెట్టింపు కమిషన్, వివిధ ఖర్చుల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ విషయం స్థానిక మార్కెట్ అధికారులకు తెలిసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో రెట్టింపు కమిషన్ వసూలు, అధిక ఖర్చుల వసూళ్లపై కొంతమంది రైతులు ఫిర్యాదులు చేయడంతో వారికి గుట్టుచప్పుడు కాకుండ సర్ది చెప్పి అధికారులు పంపించిన సందర్భాలు ఉన్నాయి. అధికారుల సహకారంతోనే మార్కెట్‌లోని కమిషన్ ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

మార్కెట్‌లో అవినీతికి చోటు లేకుండా చర్యలు

నేను ఇటీవలే మార్కెట్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాను. మార్కెట్ పరిధిలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకున్నా. కూరగాయల హోల్‌సెల్ మార్కెట్‌లో ఆరోపణలు రావడంతో సిబ్బందిని మార్చాను. ఇక దుకాణాల లైసెన్స్‌లు, హమాలీల లైసెన్స్‌ల రెన్యువల్స్, కొత్త లైసెన్స్‌ల జారీ విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని నా దృష్టికి రాలేదు. దానిపై కూడా విచారించి చర్యలు తీసుకుంటా.

-పద్మావతి, కార్యదర్శి,
ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ


మార్కెట్ కమిటీలో హోల్‌సెల్ కూరగాయల వ్యాపారం జరిగే ప్రాంతం

నాసిరకం విత్తనాలు అంటగట్టారు

దుకాణం ఎదుట రైతుల ఆందోళన


విత్తన దుకాణం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 23: తమకు నాసిరకం విత్తనాలు అంటగట్టి తీవ్రంగా నష్టపరిచారని రైతులు విత్తనాల దుకాణం ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని గీతా సీడ్స్ దుకాణం ముందు మండలంలోని సలకలకొండ గ్రామానికి చెందిన 15 మంది రైతులు బైఠాయించారు. గత 40 రోజుల కిందట పుచ్చకాయ విత్తనాలు దుకాణంలో కొనుగోలు చేశామని సలకలకొండ గ్రామానికి చెందిన గుర్రాల రాముడు, ఈరన్న, వీరారెడ్డి, నరసన్న, నగేష్ తెలిపారు. ఒక్కొక్కరం 20 ప్యాకెట్స్ పైగా పుచ్చకాయ విత్తనాలు కొని విత్తుకున్నామని అన్నారు. పైరు ఎదుగుదల ఉన్నా దిగుబడి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పుచ్చకాయ చిన్న సైజు వచ్చి పగిలిపోతున్నాయని తెలిపారు. దుకాణ యజమాని దగ్గరికి వచ్చి పలుమార్లు పంటను పరిశీలించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదని వాపోయారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వచ్చి ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని సర్దిచెప్పారు. దుకాణాన్ని పోలీసులు మూయించారు. వ్యవసాయ అధికారి అందుబాటులో లేకపోవడంతో శనివారం తమకు న్యాయం చేసేలా చూస్తామని సూచించారు.

నకిలీ నోట్ల చలామణిలో ఇద్దరికి ఏడేళ్ల జైలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 23 : నంద్యాల పట్టణంలో నకిలీ నోట్ల చలామణి కేసులో ఇద్దరికి న్యాయస్థానం ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున జరిమానా విధించింది. నంద్యాల పట్టణంలోని ఎస్పీజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో 18-1-2017వ తేదీన రాత్రి 8గంటల సమయంలో నిందితుడు బుకింగ్ వద్దకు వచ్చి రూ.100 నోటు ఇచ్చి టికెట్ తీసుకొని లోపలికి వెళ్లాడు. కొంత సమయం తర్వాత బుకింగ్ కౌంటర్‌లోని వ్యక్తి ఆ నోటును పరిశీలించి నకిలీదని నిర్ధారించుకున్నాడు. దాన్ని ఇచ్చిన వ్యక్తిని గుర్తించాడు. అప్పటికే సదరు నిందితుడు మరొకరితో కలిసి ఎగ్జిబిషన్‌లోని మూడు కౌంటర్లవద్ద ఇలాగే రూ.100 నకిలీ నోట్లను ఇచ్చి చిల్లర తీసుకున్నట్లు గమనించి అతడిని ప్రశ్నించగా మాయమాటలు చెప్పి మెయిన్‌గేట్ నుంచి పారిపోయాడు. ఈ విషయాన్నంతా ఎగ్జిబిషన్ నిర్వాహకులు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇస్మాయిల్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా మూడో పట్టణ సీఐ నరసింహులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు విచారణలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. లక్ష్మీనారాయణ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు రుజువైనందున నంద్యాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి. రాధారాణి నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

గెస్టు ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: ప్రభుత్వ బీఎడ్ కళాశాలలో గెస్టు ఫ్యాకల్టీగా ఫిజికల్ సైన్సు సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీ క్యాంప్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.ఆదినారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎడ్, డిగ్రీతో పాటు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాతానికిపైగా మార్కులతో పూర్తి చేసి ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో నెట్/స్లెట్, పీహెచ్‌డీ వంటి అదనపు అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు 42 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, వికలాంగులకు పది సంవత్సరాల సడలింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు 99493 01100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేరుశనగ ధర రూ.7,392

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 23: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వేరుశనగ ధరలు క్వింటాలు గరిష్ఠంగా రూ. 7,392 పలికింది. వారం రోజులుతో పోల్చితే వేరుశనగ క్వింటానికి రూ.800 పైగా ధర పెరిగింది. బోరుబావుల కింద సాగైన వేరుశనగను ఇప్పుడిప్పుడే రైతులు విక్రయానికి తెస్తున్నారు. ధరలు పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 5843 బస్తాల వేరుశనగను రైతులు మార్కెట్ కమిటీకి తీసుకురాగా క్వింటాలు వాటి కనిష్ఠ ధర రూ.4,219, గరిష్ఠ ధర రూ.7,392, మధ్యస్థ ధర రూ.6,989 పలికింది.

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న హేమచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: విద్యార్థి దశ నుంచి కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్(యాప్సి) ప్రొఫెసర్ కే. హేమచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టెక్ ఫెస్ట్ 2కే 24 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెనకు రూ. 15 వేల కోట్లు, విదేశీ విద్యాదీవెనకు రూ. 1.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయిలో విశ్వవిద్యాలయాల్లో చదువుకోలేని విద్యార్థుల కోసం ఎడెక్స్‌తో కలిసి ఖర్చుతో కూడుకున్న ఆన్‌లైన్ కోర్సులను ఉచితంగా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఉపకులపతి బీ. సుధీర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ చైర్మెన్ హేమచంద్రారెడ్డి నాయకత్వంలో ఉన్నత విద్యామండలి వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వై. హరిప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎన్. అంకన్న, వివిధ విభాగాల ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: జిల్లాలో 24 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ శుక్రవారం కలెక్టర్ డా.జి. సృజన ఉత్తర్వులు జారీ చేశారు.

డీటీ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సతీష్	ఓర్వకల్లు	అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే కర్నూలు
వహాబ్	అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే కర్నూలు	గోనెగండ్ల
వీరేంద్ర గౌడు	పెద్ద కడుమూరు	హోలగుంద
శివరాం	కర్నూలు అర్బన్	కల్లూరు
గురు రాజారావు	ఎమ్మిగనూరు	మంత్రాలయం
గిరి కుమార్ రెడ్డి	కల్లూరు	కర్నూలు అర్బన్
సహారా బాను	కల్లూరు రూరల్	ఎమ్మిగనూరు
శివప్రసాద్	ఎమ్మిగనూరు	కల్లూరు రూరల్
రజనీకాంత్ రెడ్డి	ఆదోని	ఆలూరు
రామేశ్వరరెడ్డి	కౌతాళం	కోసిగి
లక్ష్మీనారాయణ	చిప్పగిరి	పత్తికొండ
అహ్మద్	ఆదోని	చిప్పగిరి
లక్ష్మీరాజు	గోనెగండ్ల	ఆదోని
శేఖర్‌రావు	మంత్రాలయం	ఆదోని
నిజాముద్దీన్	తుగ్గలి	కౌతాళం
రఘువీర్	నందవరం	ఎమ్మిగనూరు
విజయ్‌కుమార్	ఆలూరు	పత్తికొండ
రుద్రగౌడు	కోసిగి	పెద్దకడుమూరు
దీప	హొళగుంద	నందవరం
సుదర్శన్	దేవనకొండ	ఓర్వకల్లు
విష్ణుప్రసాద్	పత్తికొండ	కృష్ణగిరి
నాగరాజు	మద్దికెర	తుగ్గలి
గీతా ప్రియదర్శిని	కర్నూలు	మద్దికెర
రవిచంద్ర	క్రిష్ణగిరి	కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం

అదేవిధంగా సార్వత్రిక ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ పని నిమిత్తం డిప్యూటీ తహసీల్దార్లకు కలెక్టర్ అసెంబ్లీ స్థానాలను కేటాయించారు.

వినీత్	ఆదోని	జాకీర్ హుశేన్	కోడుమూరు
బాలరాజు	ఆలూరు	మహేష్	ఎమ్మిగనూరు
పెద్దయ్య	మంత్రాలయం	భీమేష్	పత్తికొండ

ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకంజ

- 50 శాతం కూడా దాటని వైనం
- వడ్డీ మినహాయింపు కోసం ఎదురు చూపులు


ఆదోని మున్సిపల్ కార్యాలయం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 23: ఫిబ్రవరి నెల పూర్తి కావస్తున్నా, పట్టణ ప్రాంతాలలోని పురపాలకలో ఆస్తి పన్నుల వసూళ్ల నెమ్మదించడంతో జిల్లాలో 50 శాతం కూడా దాటని పరిస్థితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైతే ఎన్నికల హడావుడి మొదలవుతుంది. ఫలితంగా పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి సారించే అవకాశం ఉండదు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం నిధుల కొరత ఏర్పడే పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లాలో కర్నూలు కార్పొరేషన్ తప్ప, ఇతర మున్సిపాలిటీలలో పన్నుల వసూళ్ల 50 శాతం కూడా చేరుకోలేదు. గత ఏడాది కన్నా, ఈ ఏడాది పన్నుల వసూళ్ల పూర్తిగా వెనుకపడ్డట్టు తెలుస్తోంది. కర్నూలు కార్పొరేషన్‌లో రూ.89.18 కోట్లకు గాను రూ.47.06 కోట్లు (52 శాతం) వసూలైంది. ఆదోని మునిసిపాలిటీలో రూ.14.77 కోట్లకుగాను, రూ.5.96 కోట్లు (40 శాతం), ఎమ్మిగనూరు మునిసిపాలిటీలో రూ.5.98 కోట్లకుగాను రూ.2.59 కోట్లు (43.30 శాతం), గూడూరు మున్సిపాలిటీలో రూ.1.20 కోట్లకుగాను రూ.50 లక్షలు (49.90) మాత్రమే ఆస్తి పన్నులను వసూలు చేశారు.

రుణమాఫీ కోసం ఎదురు చూపు

పాత బకాయిదారులతోపాటు ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటన చేస్తుందేమోనని చాలా మంది పన్నుల చెల్లింపును వాయిదా వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వడ్డీ మాఫీపై ప్రభుత్వం త్వరగా ప్రకటన చేస్తే వసూళ్ల పెరిగే అవకాశం ఉంటుందని పురపాలక అధికారులు అంటున్నారు. ప్రతి ఏడాది మార్చిలో వెలువడే వడ్డీ రుణమాఫీ ప్రకటనను అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ నెలలోనే ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.

గంజాయి ముఠా అరెస్టు

6.5 కిలోల గంజాయి స్వాధీనం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 23: గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు ఏడుగురు గంజాయి విక్రేతలను అరెస్టు చేశారు. వారి నుంచి 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ ఈ వివరాలను వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలోని షికారీ కాలనీకి చెందిన షికారి నాగు, షికారి మంజుల, కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం రచ్చుమర్రికి చెందిన నరసప్ప, బుక్కరాయసముద్రం మండలం రామవేంద్రకాలనీకి చెందిన నిస్సార్ అహ్మద్, అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన మేకల ప్రసాద్, కర్నూలు జిల్లా కోసిగి మండలం పల్లెపాడుకు చెందిన ఎర్రతోట లక్ష్మణ్ణ, అదే గ్రామానికి చెందిన పోయింటి ఈరన్నను అరెస్టు చేశామని అన్నారు. షికారి నాగు, నరసప్ప, నిస్సార్ అహమ్మద్, మేకల ప్రసాద్, షికారి మంజుల ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఎర్రతోట లక్ష్మణ్ణ, పోయింటి ఈరన్న నుంచి వీరు గంజాయి కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. కిలో రూ.11 వేలకు కొనుగోలు చేసి, 300 ప్యాకెట్లుగా తయారు చేసుకుంటారని, ఒక్కో ప్యాకెట్‌ను రూ.150 ప్రకారం గుంతకల్లు, అనంతపురం, బుక్కరాయసముద్రం, గుత్తి తదితర ప్రాంతాలలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో సిబ్బంది మూర్తి, లక్ష్మీనారాయణ, శివ, రమేష్ బృందంగా ఏర్పడి ఈ ముఠాను పట్టుకున్నారని తెలిపారు. అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎస్పీ

గ్రూప్-2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించండి

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: జిల్లాలో ఈ నెల 25న నిర్వహించే గ్రూప్-2 సర్వీసెస్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిల్వర్‌జూబ్లీ కళాశాల ఆడిటోరియంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 25న నిర్వహించే గ్రూప్-2 పరీక్షలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొట్టమొదటిసారి గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ఐఏఎస్ అధికారి కో ఆర్డినేటింగ్ అధికారిగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ నెల 25న ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు ఓఎంఆర్ ఆధారంగా స్క్రీనింగ్ టెస్టు (ఆబ్జెక్టివ్ టైప్) ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కర్నూలు నగరం, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోనిలోని 126 సెంటర్లలో 36వేల మంది గ్రూప్-2 పరీక్షలు రాస్తున్నారన్నారు. విశాఖపట్నం తర్వాత కర్నూలు జిల్లాలోనే అధికంగా ఈ పరీక్షలు రాస్తున్నారన్నారు. గ్రూప్-2 పరీక్షల అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. 8886884766 ఈశ్వర్ డి సెక్షన్, జూనియర్ అసిస్టెంట్, 8142460214 శ్రీనివాసులు, గ్రీవెన్స్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్, 08518-277305 ల్యాండ్ లైన్ నెంబరు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

6 కేసులు నమోదు, అపరాధ రుసుం వసూలు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 23: కర్నూలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శుక్రవారం మండిబజార్, పాతబస్తీ, రాజ్‌థియేటర్ వద్ద కూల్‌డ్రింక్, కిరాణ, హార్డ్‌వేర్, బేకరీలలో దాడులు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. పలు చోట్ల ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయాలు చేయడం, తూనిక రాళ్లకు ముద్రలు లేకపోవడం, ప్యాకేజీలపై డిక్లరేషన్ లేకపోవడంతో ఆరు కేసులను నమోదు చేసి రూ.18 వేల అపరాద రుసుం విధించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ పరమేశ్వరకుమార్ మాట్లాడుతూ ఎవరైనా దుకాణదారులు ఎక్కువ ధరకు అమ్మినా, తూనికపు యంత్రాలు, రాళ్లకు ముద్రలు లేకుండా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: ఓటర్ల జాబితాపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి.సృజన అన్నారు. శుక్రవారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో పార్ట్ డిస్పోజల్ ఎన్నికల సన్నద్ధత అంశాలపై సమావేశం నిర్వహించి జిల్లాలో జరుగుతున్న ఏర్పాట్లపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవో ముఖేష్ కుమార్ మీనాకు వివరిస్తూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్ట్రాంగ్ రూమ్ విషయాలు, ఎలక్షన్ కౌంటింగ్ సెంటర్ల వివరాలు, వచ్చిన కంప్లైంట్స్ వివరాలు, దినపత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలపై తీసుకున్న చర్యల వివరాలను పారదర్శకంగా ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు. కర్నూలు జిల్లాకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులు ఉన్నాయని, వీటిపై నిరంతరం నిఘా ఉంచామని, ఇంత వరకు రూ.7.18 కోట్లు నగదు స్వాధీనం పరుచుకున్నామని తెలిపారు. కొద్ది మొత్తంలో లిక్కర్ కూడా స్వాధీనం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. దినపత్రికలలో వచ్చిన మండలాలకు సంబంధించిన 152 కంప్లైంట్లను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న డీటీఎఫ్ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 23: 60 సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులకు ఎన్నికలు, పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డీటీఎఫ్ జిల్లా శాఖ కోరింది. డీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డీఈవో కార్యాలయంలో డీఈవో శ్యామూల్‌ను డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, ప్రధాన సంపాదకులు రత్నం యేసేపు, గోపాల్‌లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి ప్రీఫైనల్ ప్రశ్నాపత్రాలను ఉదయం 9 గంటల నుంచి ఎంఈవో కార్యాలయాల ద్వారా సరఫరా చేయాలని కోరారు. పాఠశాలలను మానేసిన 8వ తరగతి విద్యార్థులు మళ్లీ బడికి హాజరైతే వారికి కూడా ట్యాబ్‌లు సరఫరా చేయాలని తెలిపారు. నాడు-నేడు కింద మంజూరైన వాటర్ ప్లాంటు మరమ్మతులు చేయించి తాగునీటి వసతులను కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలకు ఫైబర్ నెట్ పునరుద్ధరణ చేయాలని, పెండింగ్ విద్యుత్ బకాయిలను మంజూరు చేయాలని కోరారు. డీటీఎఫ్ నాయకులు సుబ్బరాయుడు, మద్దయ్య పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి కృషి చేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 23: ముస్లింల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆల్ ఇండియా మిల్లీ మౌలానా అబ్దుల్ ఖదీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కౌన్సిల్ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి డా.షేక్ మహబూబ్ బాషా అధ్యక్షతన నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, వైద్యపరంగా ముస్లిం మైనార్టీల్లో చైతన్యం కల్పించడమే కౌన్సిల్ ముఖ్య ఉద్దేశమన్నారు. ముస్లిం హక్కుల పరిరక్షణకు ఏ పార్టీకి కృషి చేస్తుందో అదే పార్టీకి కౌన్సిల్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియ మించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మౌలానా ఇలియాస్, రాష్ట్ర కార్యదర్శి డా.షాకీర్, రాష్ట్ర అదనపు కార్యదర్శి అన్సర్ బాషా, జిల్లా అధ్యక్షుడు అక్రమ్, కోశాధికారి రెహమాన్ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 26 మంది ఎంపిక

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: జాబ్ మేళాకు 53 మంది హాజరు కాగా 26 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి పి. దీప్తి తెలిపారు. శుక్రవారం సీ.క్యాంప్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యా లయంలో నిర్వహించిన జాబ్ మేళాలో మోడ్ ప్లస్, శ్రీరాజబాగ్స్, బీఎఫ్ఎల్ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 23: స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ప్రిన్సిపాల్ సి.సుంకన్న అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. ఆర్ఐవో గురువయ్యశెట్టి, ప్రిన్సిపాల్స్ పరమేశ్వరరెడ్డి, నాగస్వామి నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

గూడూరు, ఫిబ్రవరి 23: టీడీపీ ఆధ్వర్యంలో ఈనెల 25న తలపెట్టిన కర్నూలు పార్లమెంట్ స్థాయి జయహో బీసీ మహాసభను జయప్రదం చేద్దామని జిల్లా టీడీపీ నాయకుడు నాగేశ్వరరావు యాదవ్, కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ కోరారు. శుక్రవారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ ఈ నెల 25న కర్నూలులోని ఎంఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో జరగబోయే జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర, సత్రం రామ కృష్ణుడు, విజయ్ కుమార్, జగదీష్ గౌడ్, హనుమంతరావు చౌదరి, మన్సూన్ బాషా, కళ్యాణ్ రఘు బాబు, గోపాల్, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 23: నగరంలోని బుధవారపేటలోని నృసింహ సరస్వతిస్వామి దేవస్థానంలో ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన మధుర కవి ఎలమర్తి రమణయ్య మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి అవతారంగా నలుగురు అవధూతలు ఉద్భవించారని, వారిలో రెండో అవతారమే నృసింహ సరస్వతి స్వామి అని అన్నారు. యాగంటి స్వామి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఇంజినీర్ సంతోష్, ముఖ్యవక్త ఎలమర్తి రమణయ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వా హక సంస్థ ప్రతినిధులు రాజగోపాల్, మల్లికార్జున, సగరం నాగారాజు, తడకనపల్లి రాజు, సందడి మహేష్, సందడి సుధాకర్, జంపాల పార్వతమ్మ, జంపాల చంద్రశేఖరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అందరికీ అండ కాంగ్రెస్ జెండా

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: మనందరి అండ కాంగ్రెస్ జెండా అని మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కే. బాబు రావు ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ సెల్ విభాగం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 26న అనంతపురం జిల్లా నుంచి ఎన్నికల శంఖారావం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు జాతీయ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామోదరం రాధాకృష్ణ, క్రాంతి నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని దోచేస్తున్న సీఎం జగన్

గౌరు చరిత, మల్లెల రాజశేఖర్



టీడీపీలో చేరిన వారితో గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 23: ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని దోచేస్తున్నారని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వ గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను సీఎం జగన్ మోసం చేశాడన్నారు. జగన్మోహన్ రెడ్డి సిద్ధం కార్యక్రమంలో పత్రికలను విమర్శించడంతో వైసీపీ మూకలు రెచ్చిపోయి జర్నలిస్టులు, ఫొటో గ్రాఫర్లను, పత్రికా కార్యాలయాలపైన దాడులు చేయించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి, తిప్పా యపల్లె సుధాకర్ రెడ్డి, మౌలీశ్వరరెడ్డి, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు, తెలుగు యువత అధ్యక్షుడు రామచంద్రుడు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ సుధాకర్, ఖాదర్ బాషా, జోకార్ బాషా, రజాక్, బజారు, జగదీష్, సుల్తాన్, శాలూబాషా పాల్గొన్నారు.

గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిక

కల్లూరు: వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నచ్చక 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ పాణ్యం, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జిలు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం మాధవీనగర్‌లోని గౌరు స్వగృహంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. టీడీపీ జనసేన నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఓర్వకల్లు టౌన్‌లోని వైసీపీ ముఖ్యనా యకుడు ఏసోబుతో పాటు వైసీపీ 7వ వార్డ్ మెంబర్ సతీష్, ఖాజాహుసేన్, షాషావలి, దావూద్‌హుసేన్, సుదర్శన్, సుమంత్, అనిల్ కుమార్, అమృత రాజ్, సి.రాజు, శోభన్‌బాబు తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోవిం దరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డి, సుధాకరయ్య, మాజీ ఎంపీటీసీ నాగరాజు, అల్లాబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి: రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలయ్యేలా వైసీపీ ప్రభుత్వం ఒత్తిడి తేవాలని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలను ఏపీ యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ నాయ కులు కోరారు. శుక్రవారం మాధవీనగర్‌లోని గౌరు స్వగృహంలో గౌరు దంపతులను కలిసి వినతి పత్రం అందించారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సర్వీస్‌లను రెగ్యులర్ చేసి పెన్షన్ గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలని కోరారు. టీడీపీ మ్యానిఫెస్టోలో ఈ అంశాలను చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్, శ్రీనివాసరావు, సురేష్‌కుమార్, గోపీమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● **దూపాడు దేవరలో గౌరు:** కల్లూరు అర్బన్ 28వ వార్డులోని దూపాడులో శ్రీమాంకలమ్మ దేవరలో గౌరు వెంకటరెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, డి.రామాంజనేయులు, వాకిటి మాదేష్, ప్రభాకర్‌యాదవ్, లోకేష్, శేఖర్, వెంకటేష్‌రెడ్డి, కాసాని మహేష్‌గౌడ్, ఎస్.ఫిరోజ్ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలపై యుద్ధ ప్రభావం

టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల యుద్ధం ప్రపంచ దేశాలపై ప్రభావం ఉంటుందని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ దేశాలలోని కొన్ని అంత ర్యుద్ధాలు మానవత కోణంలో ఆలోచించాల్సిన అవరం ఉందన్నారు. ఈ సమావేశానికి హైదరాబాద్ సెయింట్ జోన్స్ కళాశాల ప్రొఫెసర్ భ్రమశ్రీ రెండో సెషన్‌కు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వేంకటేశ్వర యూనివర్సిటీ ఆచార్య మురళీధర్. ప్రొఫెసర్లు నజీరుద్దీన్, జఫరుల్లా, ఖాజా మొద్దీన్, ప్రతిమ రాయ్, సునీతరోస్, మానసరెడ్డి, దేవీకారాణి, విజయలక్ష్మి, వేదవతి, సుశీల, వరలక్ష్మి, నజాయితుల్లా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్నీ ఇబ్బందులే.. వైసీపీ పాలనలో అన్నీ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలో రెండో విడత సైకిల్ యాత్ర ఆయన చేపట్టారు. ఉస్మానియా కళాశాల సమీపంలోని టీజీ వెంకటేష్ మైనార్టీ షాదీఖానా వద్ద నుంచి సైకిల్ యాత్రను ప్రారంభించి గోల్ గుమ్మజ్ చేరుకుని ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కర్నూలు నగర వాసులు తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ట్రాఫిక్ తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి అర్షద్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని
ఆదర్శంగా తీసుకోండి : మంత్రి బుగ్గన

ఓర్వకల్లు, ఫిబ్రవరి 23: ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని విమానాశ్రయం రహదారి పక్కల ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జ్ఞాపకార్థం విగ్రహ ఏర్పాటుకు మంత్రి బుగ్గన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఉయ్యాలవాడ ఎయిర్‌పోర్టులో స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, గ్రీన్ కో డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసనాయుడు, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, తహసీల్దార్ నటరాజ్, ఎంపీడీవో మల్లేశ్వరి, ఎస్ఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

సి.బెళగల్, ఫిబ్రవరి 23: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తిమ్మనదొడ్డి, గుండ్రేవుల గ్రామాలలో ఆయన పర్యటించి రౌడీ షీటర్లతో సమావేశమయ్యారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయండి

▸▸ కడప ఆర్జేడీ ఎద్దుల రాఘవరెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 23: జాతీయ విద్యా విధానంలో భాగంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కడప రీజినల్ డైరెక్టర్ ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలోని సెమినార్ హాలులో విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో రాఘవరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల్లో చిత్తశుద్ధి లోపించిందని, నిర్లక్ష్యాన్ని వీడి పాఠశాలల విద్యను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేసి ఉపాధ్యాయుల బోధన పనితీరుపై నిఘా ఉంచాలన్నారు. పాఠశాలలో ఎన్‌రోల్‌మెంటును పెంచి మూత పడిన పాఠశాలలను తిరిగి తెరిపించేందుకు కృషి చేయాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో రాసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలకు సరఫరా చేసిన



మాట్లాడుతున్న ఎద్దుల రాఘవరెడ్డి

స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌టీ చానళ్లు, మూలన పడేయకుండా విద్యార్థుల వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి శామూయేల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిర్లిప్తతను వీడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ విజయజ్యోతి కుమారి, ఏడీ శ్యామేల్ పాల్, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 23: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు హను మంతరెడ్డి అధ్యక్షతన భాగ్యనగర్ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, పూర్తి పెన్షన్ అమలు చేసి గ్రాడ్యుటీ సర్వీసు రూల్ ప్రకారం చెల్లించాలని, అర్హులందరికీ పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగు సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీఅంజిబాబు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టైలర్స్ డేను జయప్రదం చేయండి

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 23: ఈనెల 28న జరిగే టైలర్స్ డేను జయప్రదం చేయాలని జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖలీల్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పెద్దమార్కెట్ వద్ద గల ఉర్దూఘర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో టైలర్స్ డే పోస్టర్‌ను అసోసియేషన్ ఇతర ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖలీల్ బాషా మాట్లాడుతూ ఈనెల 28న సాయంత్రం ఐదు గంటలకు ఉర్దూఘర్‌లో టైలర్స్ డేనునిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మేయర్ బీవై రామయ్య, బాలసాయి సెంట్రల్ ట్రస్టు డైరెక్టర్ టి.రామారావు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా టైలర్స్ అసోసియేషన్ నాయకులు బాషా, అబ్దుల్ జబ్బార్, ఫారుక్, అక్బర్, బి. రామకృష్ణ, ఎండీ కాశీం, సైపుల్లా పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇంటర్న్‌షిప్‌ను చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 23: ప్రతి విద్యార్థి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఇంటర్న్‌షిప్ చేయాలని ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సీడీపీ-2024 కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సుధీర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ సాంకేతికత నైపుణ్యతను పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం హేమ చంద్రారెడ్డిని ప్రిన్సి పాల్ శ్రీనివాసరెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీసీ డిజిటల్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకుడు నాగవీర్, సైంట్ కంపెనీ వ్యవస్థాపకుడు డా.వీవీఆర్ మోహన్ రెడ్డి, హెచ్‌ఆర్‌ఎలు, ప్లేస్‌మెంటు ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉంది'

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 23: రైతుల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ఉన్న రైతుల సమస్యలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నారని, చెరుకు పంటకు పెరిగిన గిట్టుబాటు ధర దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. బీజేపీ ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ మురళీనాయుడు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రామాంజినేయులు, కోశాధికారి లోకేశ్వరయ్య, వావిలాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే లైసెన్సులు రద్దు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 23: కర్నూలు మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు అక్రమాలకు పాల్పడినా లైసెన్సులు రద్దు చేస్తామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కమీషన్ ఏజెంట్లు తమ వద్దకు వచ్చే రైతులకు చిత్తు పేపర్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ పంట ఉత్పత్తుల అమ్మకాలకు సంబంధించిన వివరాలను రాసివ్వరాదని కంప్యూటర్ పత్రాన్ని అందజేయాలని స్పష్టం చేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 23: విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం అందించాలని మండల విద్యాధికారి జ్యోతి ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొటారు మిట్ట, కోటస్కూల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈవో జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు డ్రాప్ అవుటు లేకుండా చూడా ల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదేనని అన్నారు. ఎంఈవో వెంట హెచ్‌ఎంలు కిశోర్, హనుమన్న, సీఆర్‌పీలు ఉన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 23: నగరంలోని 52 వార్డులలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నగరూరు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ సుంకేసుల రిజర్వాయర్ నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వరకు రూ.66కోట్లతో చేపడుతున్న తాగునీటి పైప్‌లైన్ల పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని అనేక వార్డు లలో తాగునీటి పైపులు మురుగు కాలువల్లోనే ఉన్నాయని అన్నారు. ఆ పైపులు లీకేజీ కావడంతో ప్రజలు అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారని అన్నారు. వీటిపై దృష్టికి సారించి మురుగు కాలు వల్లో నుంచి తాగునీటి పైప్‌లైన్ల తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాలతి, ఓబీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మురళీనాయుడు, అధికార ప్రతినిధి గోరంట్ల రామాంజనేయులు, కోశాధికారి లోకేశ్వరయ్య పాల్గొన్నారు.

● నగరంలోని 17వ వార్డులో ఉన్న ఎల్‌బీజీ నగర్‌వాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి



అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, అధికారులకు కాలనీలో కనీస వసతులు కల్పిం చాలని విజ్ఞప్తి చేశామన్నారు. టెండర్లు ద్వారా పనులు ప్రారంభించిన కాం ట్రాక్టర్లు మధ్యలోనే పనులు ఆపేసి వెళ్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. నగర శాఖ కార్యదర్శి బాబయ్య, సహాయ కార్యదర్శి సి.మహేష్, బీసన్న, సుధాకర్, అంజి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తెద్దాం



ప్రజలతో మాట్లాడుతున్న దస్తగిరి

గూడూరు, ఫిబ్రవరి 23: తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తెద్దామని పార్టీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లాపురం గ్రామంలో బొగ్గుల దస్తగిరి పర్యటించి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్ళి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, జె సురేష్, రేమట వెంకటేష్, టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, పౌలు, సత్యనారాయణ రెడ్డి, విజయ్ కుమార్, కూరగాయల చాంద్ బాషా, మధు, వీర కుమార్, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో వివాదం

● మల్టీ యుటిలిటీ సెంటర్‌కు భూమి పూజ
● అడ్డుకున్న కొందరు వైద్యులు
● శిలాఫలకం ధ్వంసం.. రాళ్ల తొలగింపు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 23: కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేయనున్న మల్టీ యుటిలిటీ సెంటర్ తాత్కాలిక భూమి పూజ వివాదంగా మారింది. గురువారం కాలేజీ గ్రౌండ్స్‌లో కర్నూలు మెడికల్ కాలేజీ అల్యూమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూమి పూజను కొందరు వైద్యులు, విద్యార్థులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా, ఎవరికీ చెప్పకుండా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో భూమి పూజ ఎలా చెస్తారని కొందరు వైద్యులు ప్రశ్నించారు. అసలు భూమిపూజకు ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. కాలేజీ గ్రౌండ్స్‌లో ఇలా నిర్మాణాలు చేస్తే భవిష్యత్తులో అభివృద్ధికి ఇబ్బందిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తర్వాత భూమి పూజ చేసిన రాళ్లను అక్కడ నుంచి తొలగించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసి, సిమెంటు దిమ్మెలను కూడా తొలగించారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో కార్యక్రమాన్ని అల్యూమి నాయకులు అర్థాంతరంగా ముగించారు. కాలేజీ అధికారులు అనుమతి లేకుండా అల్యూమి నాయకులు భూమి పూజకు ప్రయత్నించడంపై కొందరు వైద్యులు మండిపడుతున్నారు.



తొలగించిన రాళ్లు

మోదీ మూల్యం చెల్లించుకోవాల్సిందే..!



నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 23: రైతుల ఆగ్రహానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని నన్నూరు గ్రామంలో రైతు సమన్వయ సంఘాల పిలుపు మేరకు బ్లాక్ డే సందర్భంగా హర్యానా, రాజస్థాన్ సరిహద్దుల్లో బీజేపీ ప్రభుత్వం పోలీసు కాల్పుల్లో చనిపోయిన యువ రైతు కిరణ్‌సింగ్‌కు మద్దతుగా నన్నూరు గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి నాయకుడు మధుసూదన్ హాజరై మాట్లాడుతూ 2021లో రైతులు మద్దతు ధర, విద్యుత్ సంస్కరణ బిల్లు తదితర అంశాలపైన పోరాడిన సందర్భంగా ప్రధాని మోదీ హామీ ఇచ్చి ఉద్యమాన్ని విరమింపజేశారన్నారు. మూడు డిమాండ్లను ఏడాదైనా పరిష్క రించకపోవడంతో ఈనెల 13న ఢిల్లీలో పోరాటానికి దిగారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి రైతుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరి ష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జగన్నాథం, మధు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి: సీపీఎం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 23: జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు కే.ప్రభాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.రామాంజ నేయులు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఢిల్లీలో జరుగుతున్న రైతు పోరాటంలో కేంద్ర ప్రభుత్వం అధికార దాహానికి బలైన యువరైతు సుఖ్‌కరణ్ సింగ్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కరువు మండలాలుగా ప్రకటించిన కోసిగి, కౌతాళం మండలాల నుంచి 90 శాతం పేదలు ఊళ్లను ఖాళీ చేసి వెళ్లిపో యారని అన్నారు. పనిదినాలు పెంచామని చెబుతున్న ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. వేసవి కాలం రాకముందే జిల్లాలోనీటి ఎద్దడి ప్రారం భమైందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్ రాధాక్రిష్ణ, వెంకటేశ్వర్లు, ఎండీ ఆనంద్‌బాబు, అంజిబాబు పాల్గొన్నారు.

దళితులపై పెరిగిపోతున్న దాడులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 23: వైసీపీ పాలనలో దళితులపై దాడులు అధికమయ్యాయని దళిత జేఏసీ చైర్మన్ బొల్లెద్దుల రామకృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలో పలు వార్డులో దళిత చైతన్యయాత్ర పేరుతో పాతబస్తీలోని కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కే.ఏసన్న, కేపాల్ రాజ్, అనంతయ్య, దళిత యాత్ర కమిటీ సభ్యులు, టీడీపీ వార్డు, బూత్ నాయకులు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

గిరిజనులను నట్టేట ముంచిన వైసీపీ : కేఈ


బాట తండాలో మేనిఫెస్టోను వివరిస్తున్న కేఈ శ్యాంబాబు

తుగ్గలి, ఫిబ్రవరి 23: వైసీపీ ప్రభుత్వం గిరిజనులను నట్టేట ముంచిందని పత్తికొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బాట తండా, మీటె తండా, సూర్య తండాలలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు పర్యటించి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో అప్పా వేణుగోపాల్, రాము నాయక్, సర్పంచ్ శంకరమ్మ, లక్ష్మా నాయక్, శంకరయ్య పాల్గొన్నారు.

పత్తికొండ, ఫిబ్రవరి 23: ఈ నెల 25వ తేదీ కర్నూలులో జరిగే జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని పత్తికొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యకర్తలు పెద్దఎత్తున కార్యక్రమంలో పాలుపంచుకుని విజయవంతం చేయాలన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

పత్తికొండ, ఫిబ్రవరి 20: టీడీపీ ఎస్టీ సెల్ పత్తికొండ నియోజకవర్గ అధ్యక్షుడు చక్రినాయక్ (44) గుండె పోటుతో శుక్రవారం మృతి చెందారు. పత్తికొండ మండలం మర్రిమాన్ తండాకు చెందిన చక్రినాయక్ 25 సంవత్సరాలుగా టీడీపీలో కార్యకర్తగా, నాయకునిగా పని చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు మర్రిమాన్ తండాకు చేరుకుని చక్రి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితోపాటు టీడీపీ సీనియర్ నాయకులు మనోహర్‌చౌదరి, రామానాయుడు ఉన్నారు.

మద్దికెర: వైసీపీ నాయకులు, కార్యకర్తలు మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారని తాలుకా టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కే వీరశేఖర్‌ను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడును పరామర్శించారు.

వైభవంగా మద్దమ్మవ్వ కల్యాణోత్సవం

మద్దికెర, ఫిబ్రవరి 23: మద్దికెరలో గ్రామ దేవత మద్దమ్మవ్వకు, ఖడ్గానికి పురోహితులు కల్యాణోత్సవం నిర్వహించారు. గ్రామ దేవత మద్దమ్మవ్వ జాతరను పురస్కరించుకుని ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొని తలంబ్రాలు వేశారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంలో అధిష్ఠించి మేళతాళాలతో, బాణాసంచా పేలుస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం రథోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి : యూటీఎఫ్

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 23: టీడీపీ మేనిఫెస్టోలో ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించే విధంగా టీడీపీ నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నాగమణి, దావీదు, ఎల్లప్ప, నరసింహులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కౌలన్న, రామాంజినేయులు, రాజు, అబ్దుల్, లతీఫ్, చంద్రపాల్, ప్రసాద్, గురుస్వామి, నీలి, నాగరాజు, పాపయ్య, పరిగె, ప్రకాష్, అల్లాబకాష్, పెద్దారెడ్డి, విజయ్ కుమార్, రంగన్న దాదాపు వంద మంది పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 23: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని మండల తెలుగు యువత అధ్యక్షుడు రంగస్వామినాయుడు, ఉపాధ్యక్షుడు ఐరన్‌బండ ముల్లాబాషా, ప్రధాన కార్యదర్శి పూజారి లక్ష్మీకాంతస్వామి అన్నారు. శుక్రవారం మండల టీడీపీ కార్యలయంలో తెలుగు యువత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగి అరాచకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి కార్యకర్త సైనికునిల్లా పని చేసి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిస్వామి, రామకృష్ణ, హరికృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 23: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కందనాతి గ్రామానికి రవి (23)చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎమ్మిగనూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కుళాయి విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంఘటనలో రవికి తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రవి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 23: ఈనెల 25న కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జిల్లా కబడ్డీ పురుషుల జట్టును ఎంపిక చేస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అమర్ ప్రకాష్ తెలిపారు. 70వ ఆంధ్రప్రదేశ్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ పోటీలు నెల్లూరులో మార్చి 8 నుంచి జరుగుతాయి అన్నారు. క్రీడాకారులు 85 కేజీలు మించి ఉండరాదని తెలిపారు. తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9701012329 సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం

గోనెగండ్ల, ఫిబ్రవరి 23: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలో నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గోనెగండ్ల నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా బైలుప్పల దుగ్గెనను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో మారెప్ప, మల్లెపూలు, సూర్యప్రసాద్, వీరన్న, సామేలు, హనుమంతు, వాసు, బేతల్, అశోక్, మునిస్వామి, నరసన్న, విజయ్, జయకర్, వీరభద్ర, సామేలు పాల్గొన్నారు.

పశుఘోష




● పశుగ్రాసం, నీటి కొరతతో అల్లాడుతున్న మూగజీవాలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 23: గ్రాసం, తాగునీటి కోసం మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. పంట పొలాలు, కాలువ గట్ల వెంట మూగజీవాలు మేత కోసం వెంపర్లాడే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పచ్చి గడ్డి కాదు కదా ఒట్టి మేత కూడా కనిపించడం లేదు. దీంతో ఇండ్ల దగ్గర కూడా పశువులకు సరిపడా గ్రాసం, నీరు లభించడం లేదు. చాలా మంది రైతులు గ్రాసం నీటి కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నా రు. ట్రాక్టర్ గ్రాసం రూ.15 వేల నుంచి రూ. 18 వేల వరకు పలుకుతోంది. రాయచూరు, బళ్లారి, నందికొట్కూరు, ప్రాంతాల నుంచి పశువుల యజమానులు గ్రాసాన్ని దిగుమతి చేసుకుంటున్నారు. గోనెగండ్ల మండలంలో ఆవులు, ఎద్దులు, 25,530, బర్రెలు 5,903, గొర్రెలు, 55,257, మేకలు 887, కోళ్లు బాతులు 35,665లు ఉన్నాయి. మండుటెండలో మూగజీవాలు తాగునీటి కోసం తాపత్రయం పడటం రైతుకు కన్నీరు తెప్పిస్తోంది.

పత్తి, మిరప, పంటల సాగుతో..

గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా ఈ ఏడాది పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. చాలా మంది రైతులు గ్రాసం నీటి కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ఈ ఎడాది వరి, వేరుశనగ, పంటలను రైతులు ఎక్కువగా సాగు చేయకపోవడంతో వాటి ధర విపరీతంగా పెరిగింది. వరి, వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసిన చోట నుంచి గ్రాసం రైతులు దిగుమతి చేసుకుంటున్నారు.


మేత కోసం వెళ్తున్న మూగజీవాలు


టాక్టర్‌లో తీసుకువెళ్తున్న వేరుశనగ కట్టె

అన్నదాతలనే చంపేస్తారా..?: సీపీఐ


పత్తికొండలో మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 23: అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ వేడుకల సందర్భంగా దేశ వ్యాప్తంగా అక్షింతలు అందించిన అన్నదాతలను కాల్పులు జరిపి చంపేస్తారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారు. శుక్రవారం సీఆర్ భవన్ నుంచి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతులపై జరిపిన కాల్పులను నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రధాని దిష్టి బొమ్మను నాలుగు స్తంభాల కూడలిలో దహనం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటాలు సాగించి విజయం సాధించిన చరిత్ర రైతన్నలకే ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనలు చేపడితే.. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఆందోళన సాగిస్తున్న రైతన్నలపైనే కాల్పులు జరపడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆ కాల్పుల్లో రైతులు సుభకరణ్ సింగ్ రైతు ఉద్యమకారుడు మృతి చెందడం బాధాకరమని అన్నారు. దుర్మార్గపు పాలనను అంతమొందించేందుకు రైతులు పోరాటాలకు సన్నద్ధ కావాలని పిలుపునిచ్చారు. చనిపోయిన ఆ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజా సాహెబ్, నియోజకవర్గ అధ్యక్షులు ఉమాపతి, సీపీఐ ప్రజా సంఘాల నాయకులు నబీ రసూల్, గురుదాస్, కారన్న, వెంకట్రాముడు, కారుమంచి ఆల్తాఫ్, రాజప్ప, మాదన్న పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: మాజీ ఎమ్మెల్యే బీవీ

నందవరం, ఫిబ్రవరి 23: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు.. శుక్రవారం నందవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటా తిరిగి ప్రజలకు అందిన పథకాల గురించి తెలుసుకున్నారు. తమకు ఏ పథకాలు అందడం లేదని ప్రజలు సమాధానం ఇచ్చారు. అన్ని వైసీపీ కార్యకర్తలు అందుతున్నాయని ఆరోపించారు. అనంతరం బంగారమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేకం అమ్మవారిని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు లేక నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్టంలో వైసీపీ పాలన అరాచక రాజకీయం చేస్తోందన్నారు. పెట్రోల్, డీజిల్, కరెంట్, బస్సు చార్జీలు పెంచి సామన్య ప్రజల నడ్డి విరిచిందని తెలిపారు. దళితులకు, బీసీలు, మైనార్టీలు, బడుగు బలహీన వర్గాలకు అన్ని రకాలుగా న్యాయం చేసిందని బీవీ గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సాగనంపెందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జామియా మసీద్‌లో ముస్లింలతో కలిసి దువా చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాధవరావు, జడ్పీ మాజీ చైర్మన్ పుష్పావతి, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడు, మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు, గురురాజారావు, కాశీంవలి, దర్నాపురం గోపాల్, మాజీ జడ్పీటీసీ ఈరన్నగౌడు, పెద్దరాముడు, లచ్చప్ప, మస్తాన్, బ్రహ్మానంద రెడ్డి, రహిమాన్, గజేంద్రరెడ్డి, నందవరం షరీఫ్, వడ్డె గోపాల్, ప్రకాష్, బతకన్న, నరసింహులు, తెలుగు ఈరన్న, వెంకటేశులు, శ్రీనివాసులు, వీరేష్, ఆదిశేషు పాల్గొన్నారు.


మసీదులో దువా చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి

బీసీ సభను జయప్రదం చేయండి

కర్నూలులో జరిగే టీడీపీ బీసీ సభను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, కర్నూలు పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు జగదీష్ కోరారు. శుక్రవారం వారు నందవరం టీడీపీ కార్యాలయ దగ్గర మాట్లాడుతూ పదవులన్నీ అగ్రవర్ణాలకు ఇచ్చి ఇప్పుడు బీసీ నినాదం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో బీసీలంతా ఇది గమనించాలని కోరారు. ఈ నెల 25న కర్నూలు కన్వెన్షన్ హాలులో బీసీ సభ ఉంటుం దని బీసీలంతా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతుల డిమాండ్లను పరిష్కరించాలి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 23: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. శుక్రవారం రైతులు, ఏఐకేఎస్ నాయకులతో కలిసి ఎమ్మిగనూరులోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పంజాబ్ రైతులు ధర్నా చేస్తుంటే వారిపై పోలీసులతో కాల్పులు జరిపించడం దారుణమని అన్నారు. పంజాబ్ రైతులు చేస్తున్న ధర్నాకు దేశంలోని యువత, రైతాంగం, కార్మికు లు, ప్రజాస్వామిక శక్తులు, ప్రగతిశీల మేధావు లు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలరాజు, యల్లప్ప, మునయ్య, వీరేష్, అంజి, బుడ్డన్న, ఉరుకుంద, పెద్దయ్య, జయరాజు, మధు, ఆదామ్, రఘు, బాషా, తిమ్మప్ప పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులోని సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 23: రైతు సుభ్‌కరణ్‌సింగ్ మృతికి ప్రధాన మంత్రి మోదీ బాధ్యత వహించాలని ఏఐకేఎస్, సీఐటీయూ నాయకులు అబ్దుల్, రాముడు అన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. రైతు ఉద్యమం పట్ల మోదీ మొండి వైఖరిని మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో గోవిందు, ఆంథోని, సురేష్, వలి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు ప్రాధాన్యతను కల్పించి ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని ఓబీసీ జాతీయ విద్యార్థి సంఘం నాయకులు కిరణ్, బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు వీజీఆర్ కొండయ్య, గడిగె లింగప్ప అన్నారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప మెమోరియల్ హాలులో బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు, మాజీ కౌన్సిలర్ శివకుమార్ అధ్యక్షతన బీసీ సంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బీసీలను విస్మరిస్తున్నాయని అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న అత్యధిక బీసీల సంఖ్యను బట్టి వారికి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించాలని అన్నారు. ఎమ్మిగనూరులో వైసీపీ బీసీలకు సీటు కేటాయించిందని ఆ క్రమంలోనే టీడీపీ కూడా బీసీలకు సీటు కేటాయించాలని కోరారు. ఎమ్మిగనూరు చేనేత పిత పద్మశ్రీ మాచాని సోమప్ప ఎమ్మిగనూరుకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. ఆయన మనవడు మాచాని సోమ్‌నాథ్ రాజకీయాల్లోకి వస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆయనకు టీడీపీ సీటు కేటాయించాలని చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. సీటు కేటాయిస్తే గెలిపించి ఎమ్మెల్యేను కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివదాసు, అడ్వకేట్ మల్లికార్జున, చంద్ర, దస్తగిరి, రాముగౌడు, టీడీపీ జిల్లా నాయకులు ప్రభాకర్‌నాయుడు, కేఎస్‌పీ శివన్న, నరసన్న, రామిరెడ్డి, డాక్టర్ రఘు, మాకం నారాయణ, రంగన్న, చాంద్‌బాషా, ఉరుకుంద, విశ్వనాథ్ రమేష్, అడ్వకేట్ ఉరుకుంద పాల్గొన్నారు.


బీసీ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం తెలుపుతున్న నాయకులు

గన్‌మెన్ తొలగింపుపై కోర్టును ఆశ్రయిస్తా : తుగ్గలి నాగేంద్ర


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

మద్దికెర, ఫిబ్రవరి 23: గన్‌మెన్ తొలగింపుపై కోర్టును ఆశ్రయిస్తానని రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. శుక్రవారం మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కే వీరశేఖర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఎన్నో ఏళ్లుగా ఉన్న గన్‌మెన్ తొలగించడం అన్యాయమని, ఈ విషయంపై జిల్లా పోలీసు అధికారిని ఆశ్రయిస్తానని అన్నారు. న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్తానని తెలిపారు. తనకే మైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. విలేకరులు, ఈనాడు సంస్థపై వైసీపీ మూకలు దాడులు చేయడం మీడియా స్వేచ్ఛను హరిం చడమేనని అన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ నాయకత్వంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదం నడుస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్ చౌదరి, టీడీపీ నాయకులు ఎల్.లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్ గౌడు, రంగయ్య, విరోభ, గడ్డం రామాంజులు పాల్గొన్నారు.

వైభవంగా గోపుర కలశ ప్రతిష్ఠ

మద్దికెర, ఫిబ్రవరి 23: మద్దికెరలోని ఎస్సీ కాలనీలో వెలసిన దేవమ్మదేవి ఆలయంలో రూ.4 లక్షలతో నిర్మించిన గోపుర కలశ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం మూల విరాట్ దేవమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి నూతన వస్త్రాలతో పాటు నిమ్మకాయల దండలతో, పుష్పాలతో అలంకరించారు. అనంతరం పురోహితుల ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ఠతోపాటు గోపుర ప్రతిష్ఠకు పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సర్పంచ్ బండారు సుహాసిని, రామ్మూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, ఎంపీటీసీ బద్దల ఆంజనేయులు, గ్రామ పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కరువు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైందని సీపీఐ రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాసులు అన్నారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో డీహెచ్‌పీఎస్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక నిత్యం ఏదో ఒక ప్రాంతంలో దళిత గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు దళితులు సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజా సాహెబ్, కారన్న, వెంకట్రాముడు, ఉమాపతి, నాగిరెడ్డి, అల్తాఫ్, ముని పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం

మద్దికెర, ఫిబ్రవరి 23: ఈ నెల 20న ఎమ్మెల్యే శ్రీదేవి, చేతుల మీదుగా ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేశారు. మద్దికెర నుంచి బొజ్జనాయుని పేట గ్రామానికి రూ.2.50 కోట్లతో తారు రోడ్డు వేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. అయితే వైసీపీ పార్టీలో వర్గాలు ఉండటం వల్ల ఓర్వలేకే పగులకొట్టి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 23: విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదువుకోవాలని జీసీడీవో సునీత అన్నారు. శుక్రవారం క్రిష్ణగిరి కస్తూర్బా గాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు పంచతంత్ర కార్యక్రమంలో భాగంగా వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పాఠాలను బోధించాలని, ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా బోధన కొనగించాలని అన్నారు. అంతేగాకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఉన్నారు.

ఘనంగా తాతా లాలు స్వామి ఉరుసు

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 5: మండలంలోని చిట్యాల తాతా లాలు స్వామి ఉరుసును ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. తాతా లాలు స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో గ్రామంలో కోలాహలంగా మారింది. ఉరుసు సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శనివారం పాల వల్ల విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

29న సింహగర్జన

దేవనకొండ, ఫిబ్రవరి 23: వికలాంగుల హక్కులకై ఈనెల 29న కర్నూలు ఎస్టీబీసీ కళాశాల ఆవరణలో జరిగే సింహగర్జనను విజయవంతం చేయాలని జేపీసీ జిల్లా అధ్యక్షుడు బీసీ నాగరాజు, ఏవీ ప్రకాష్ అన్నారు. శుక్రవారం దేవనకొండలో వారు మాట్లాడుతూ వికలాంగులను ప్రభుత్వం విస్మరించిందన్నారు. వికలాంగుల అధిక సంఖ్యలో తరలి వచ్చి సింహగర్జన విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు చిన్న గిడ్డయ్య, విశ్వనాథ్, అల్లీపీరా, ఆదోని బజారి, రంగస్వామి, రఫి ఉన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

హొళగుంద, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని నెరణికి తండా, కొత్తపేట గ్రామ శివారులోని కొండల్లోని నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎస్సై పెద్దయ్యనాయుడు శుక్రవారం తెలిపారు. 800 లీటర్ల బెల్లం ఊట, 50 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కొత్తపేటకు చెందిన వీరేష్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు. దాడులలో కానిస్టేబుల్ పెద్దన్న, జనార్దన్ పాల్గొన్నారు.

రాఘవరాయడికి పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఫిబ్రవరి 23: వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. బెంగుళూరుకు చెందిన కార్తీక్ శ్రీవత్స అనే భక్తుడు అన్నదానానికి రూ. లక్ష విరాళం ఇచ్చారు.

సమయపాలన పాటించని సిబ్బంది

కౌతాళం, ఫిబ్రవరి 23: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపులోని సచివాలయం తలుపులు శుక్రవారం మధ్యాహ్నం 12గంటలైన తెరుచుకోలేదు. దీంతో లబ్ధిదారులు చక్రవర్తి, బుచ్చిరాజు, గ్రామ ప్రజలు కొంత మంది అధికారుల కోసం ఎదురుచూసి వెనుదిరిగారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సచివాలయాలను తనిఖీ చేసి విధులకు డుమ్మా కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'వైసీపీలో ఉండలేం...'

ఆలూరు, ఫిబ్రవరి 23: మంత్రి జయరామ్‌కు అన్యాయం చేసిన పార్టీలో ఉండలేమని ఆలూరు మండల వైసీపీ మాజీ కన్వీనర్ వీరేష్, కో-కన్వీనర్ అనుమయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మండల వైసీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి ఏకపక్షంగా వ్యవహరిస్తూ మంత్రి జయరామ్ వర్గాన్ని దూరం పెట్టడం వల్లే వైసీపీకి రాజీనామా చేస్తున్నామని అన్నారు.

దైవచింతనే మానవాళికి మంచి మార్గం

కోసిగి, ఫిబ్రవరి 23: దైవచింతనే మానవాళికి మంచి మార్గమని పరమపూజ్య సద్గురు అభినవ సిద్దారుడ మహాస్వామి అన్నారు. శుక్రవారం కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో వెలసిన సద్గురు అరుఢా జ్యోతి శాంతాశ్రమం వార్షికోత్సవం సందర్భంగా హుబ్లీ మఠం పీఠాధిపతి పరమపూజ్య సద్గురు అభినవ సిద్దారుడ మహాస్వామి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.